భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రత్యేకాధికారి వినయ్‌కృష్ణారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి

భూపాలపల్లి రూరల్, నవంబర్ 25 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రత్యేకాధికారి వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్ రాహుల్‌శర్మ నేతృత్వంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిపై రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, విద్యుత్, మెగా ప్రాజెక్టు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరాకు తక్షణమే అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఇసుక రవాణాలో వే బిల్స్, ట్రాన్సిట్ ఫారాలు జారీ చేయాలని, ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని, భూ సేకరణ పూర్తి చేసిన ప్రాంతాల్లో వెంటనే పనులను ప్రారంభించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను ఆదేశించారు. వచ్చే నెల 5న డ్రైరన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే కలెక్టర్ రాహుల్‌శర్మ 26వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజాపాలన – ప్రజా విజయోత్సవాలు, ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని తెలిపారు. ఇతరులకు ప్రేరణగా నిలిచిన వ్యక్తుల సహకారాన్ని హైలెట్ చేయడంతో పాటు ఉత్తమ సేవలు అందించిన కార్యదర్శులను సన్మానించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకంలో అధిక రోజులు పనిచేసిన వారిని సత్కరించాలన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ఆయన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. దరఖాస్తుల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణి నుంచి కూడా జిల్లాకు సంబంధించి వచ్చిన దరఖాస్తులు పరిష్కరించి ప్రజావాణి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 54 మంది దరఖాస్తులు ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశాల్లో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మి, డీపీవో నారాయణ రావు, ఆర్డీవో మంగీలాల్, ఇరిగేషన్ ఈఈ యాదగిరి, మైనింగ్ ఏడీ జయరాజ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్‌నాయక్, ఆర్డీవో మంగీలాల్, మెగా ప్రాజెక్టు ఏజీఎం వైవీరావు, పాషా పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగురూరల్, నవంబర్ 25: ప్రజావాణి అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 31 అర్జీలు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం తన అర్జీని ఇచ్చేందుకు వచ్చిన దివ్యాంగుడి వద్దకు కలెక్టర్ వెళ్లి అర్జీని స్వీకరించి సమస్యను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేశ్, జిల్లా, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ

ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పీవోకు వినతిపత్రం ఇస్తున్న లవ్వాల గ్రామస్తులు

ఏటూరునాగారం, నవంబర్ 25: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజనులు పాల్గొని తమ వినతులను పీవో చిత్రమిశ్రాకు అందజేశారు. తాడ్వాయి మండలం లవ్వాలకు చెందిన బీ నాగమణి పేరు అటవీ హక్కు పత్రంలో తప్పుగా పడిందని, మార్చాలని కోరుతూ వినతిపత్రం అందించారు. మంగపేట మండలం కమలాపురానికి చెందిన భూక్యా రాములు ఐటీఐ పూర్తి చేసిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఖానాపురం మండలం నాజితండాలో డ్రైనేజీలు లేక రోడ్లపైకి మురుగు నీరు చేరి బురదమయంగా మారుతున్నదని, డ్రైనేజీలు నిర్మించాలని గ్రామానికి చెందిన భూక్యా అనిల్, ఎనిమిది మంది వినతిపత్రం సమర్పించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చిన్నఎల్లాపూర్ గ్రామానికి చెందిన భూక్యా దేవేందర్ తమ గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు మంజూరు చేయాలని విన్నవించారు. తనను కాంట్రాక్టు పద్ధతిలో స్వీపర్‌గా నియమించాలని ఏటూరునాగారానికి చెందిన దుగ్గి పద్మ కోరారు. టైలరింగ్‌లో శిక్షణ పొందడంతో పాటు టీటీసీ పూర్తి చేసిన తనకు కుట్టు మిషన్లు ఇప్పించాలని మంగపేట మండలం కోమటిపల్లికి చెందిన చేల శమంతకమణి వినతి పత్రం అందించారు. ఏదైనా ఉపాధి కల్పించాలని గోవిందరావుపేట మండలం చల్వాయికి చెందిన యాక లక్ష్మి కోరారు. తాడ్వాయి మండలం బయ్యక్కపేటకు చెందిన 70మంది గ్రామస్తులు ఆర్‌వోఆర్‌లో ఇండ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. ఎస్‌వో రాజ్‌కుమార్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌వో రాజ్‌కుమార్, సురేశ్ బాబు, ఈఈ వీరభద్రం, జియోలజిస్ట్ ఆలం కిశోర్, ఏఈఈ ప్రభాకర్ పాల్గొన్నారు. దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను పీవో ఆదేశించారు.

ఆదివాసీ గ్రామాల్లో పీవో పర్యటించాలి

వెంకటాపురం(నూగూరు): ఆదివాసీ గ్రామాల్లో ఐటీడీఏ పీవో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని జీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి నిలిచిపోయిందని, ఆదివాసీల భూములను వలస గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. కనీసం అంగన్‌వాడీ భవనాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్, నాయకులు ఉన్నారు.

ప్రజలకు విద్య, వైద్యం అందించాలి..

కృష్ణకాలనీ, నవంబర్ 25: రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అంబేద్కర్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలన్నారు. ప్రతి గ్రామంలో ఆధునిక హాస్పిటల్ నిర్మించాలని, అర్హతలను బట్టి ఉపాధిని అందించి చేతినిండా పని కల్పించాలన్నారు. అర్హులైన వారందరికి 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ ధర్నాకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమనాథుని సత్యనారాయణ, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్యా సురేశ్‌నాయక్, రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు గుగులోత్ సంతోష్ నాయక్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేశ్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి భూపాలపల్లి టౌన్ అధ్యక్షుడు జోగుల సమ్మయ్య మద్దతు పలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు కండె రవి, చిట్యాల శ్రీనివాస్, శీలపాక నాగరాజ్, వివిధ మండల నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి

తాడ్వాయి, నవంబర్ 25: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. లింగాల గ్రామానికి చెందిన ఆగబోయిన మల్లేశ్ కుమారుడు అరవింద్(18) పనుల నిమిత్తం ట్రాక్టర్‌పై వెళ్తుండగా గ్రామ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇంజిన్‌పై కూర్చున్న అరవింద్ ట్రాక్టర్ కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తప్పులు లేకుండా డేటా నమోదు చేయాలి

భూపాలపల్లి రూరల్, నవంబర్ 25: సర్వే డేటాను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న డేటా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డేటా నమోదులో భద్రత పాటించాలని, ఏదేని సమాచారం బయటికి వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సూపర్ వైజర్లు పటిష్ట పర్యవేక్షణ చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసిన తర్వాత ఎంపీడీవో కార్యాలయాల్లో భద్రపరచాలని, పాస్‌వర్డులను ఉపయోగించడం, డేటా ఎంట్రీలు, ఆన్‌లైన్ సమయంలో సాఫ్ట్‌వేర్ భద్రత చాలా ముఖ్యమని తెలిపారు. నమోదు ప్రక్రియలో కాలాలను పరిశీలించి రోజుకు ఎన్ని ఫారాలు నమోదు చేస్తున్నారని డేటా ఎంట్రీ ఆపరేటర్లును అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల పేర్లు, ఫోన్ నంబర్లు కూడా నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఇక్బాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ధాన్యం కొనాలి

గణపురం : ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులకు డబ్బుల చెల్లింపు కోసం వెంటనే ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి విజయ్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలన్నారు. 17 శాతం తేమ వచ్చిన ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దని కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడితే ఇన్‌చార్జిలే బాధ్యత వహించాలన్నారు. ధాన్యం రావడం ప్రారంభమైందని తగు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ కన్నెబోయిన కుమార్‌యాదవ్, వైస్ చైర్మన్ సిరిగినేని బాబూరావు, డైరెక్టర్ పూజారి రాజేందర్, సీఈవో పుట్ట సురేశ్ పాల్గొన్నారు.

జాగిలం మృతదేహానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ శబరీష్

గౌరవ లాంఛనాలతో జాగిలానికి అంత్యక్రియలు

ములుగురూరల్, నవంబర్ 25 : డాగ్‌స్క్వాడ్ బృందంలో సేవలందించిన స్కాంపర్ అనే జాగిలం అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం జాకారంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో పోలీసులు గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. ఎస్పీ డాక్టర్ శబరీష్ హాజరై జాగిలం మృతదేహానికి పూలమాలలు వేసి సెల్యూట్ చేశారు. అదనపు ఎస్పీ సదానందం, ఆర్ఐలు సంతోశ్, వెంకటనారాయణ, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

గణపురం, నవంబర్ 25 : సింగరేణి కేటీకే 8 ఇంక్లైన్ గనిలో గైర్హాజరైన ఉద్యోగులకు సోమవారం ఇంటింటికీ వెళ్లి అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. జీఎం సూచనల మేరకు హాజరు తప్పించడం వల్ల సంభవించే ప్రతికూల ఫలితాలు, కుటుంబ ఆర్థిక స్థితిగతులపై దాని ప్రభావాన్ని వివరించారు. విధుల్లో కొనసాగకపోవడంతో సంస్థపై ఇతర ఉద్యోగుల పనిపై కలిగే ప్రభావాన్ని గుర్తించి, వీలైనంత త్వరగా విధుల్లో చేరాలని కుటుంబ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ సాయికృష్ణ, వెల్ఫేర్ క్లర్క్ లావణ్‌కుమార్ యూనియన్ నాయకులు శంకర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మహాధర్నా'కు తరలి వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

ములుగురూరల్: మానుకోటకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోవిందరావుపేట: మహాధర్నాకు వెళ్తున్న నాయకులు

ములుగురూరల్, నవంబర్ 25: లగచర్ల బాధితులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సోమవారం ఉదయం తరలివెళ్లారు. వారిలో పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, నాయకులు పోరిక గోవింద్‌నాయక్, కాకులమర్రి ప్రదీప్‌రావు, సానికొమ్ము ఆదిరెడ్డి, ద్రోణాచారి, గజ్జి నగేశ్, కోగిల మహేశ్, స్వరూప, మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ లక్ష్యం

గోవిందరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే వరకు వారికి వెన్నుదన్నుగా ఉంటామని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్ అన్నారు. సోమవారం మహబూబాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాకు మండల నాయకులు తరలివెళ్లారు.

కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న పురోహితులు

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

గణపురం, నవంబర్ 25 : మండలకేంద్రంలోని కాకతీయుల (రెడ్డిగుడి) నాగలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. మండలకేంద్రానికి చెందిన మోటపోతుల సరిత-రవీందర్ దంపతులతో పురోహితులు వినయ్‌శర్మ, భద్రయ్య కల్యాణ క్రతువు నిర్వహించగా గ్రామానికి చెందిన మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రావుల సురేశ్, మోటపోతుల రాజన్న, ఉయ్యాల భిక్షపతి, మాజీ ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కటుకూరి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి

వేదాన్ష్ కార్తికేయ (ఫైల్)

కాటారం, నవంబర్ 25 : పాముకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన కాటారంలోని ఎర్రగుంటపల్లిలో జరిగింది. ఎస్సై అభినవ్, చిన్నారి బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కల్లగుంట వెంకటేశ్వర్లు ఎస్బీఐలో పనిచేస్తున్నాడు. అతడి కుమార్తె త్రివేణికి ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన సత్యనారాయణతో వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కూతుళ్లతోపాటు కుమారుడు వేదాన్ష్ కార్తికేయ (4) ఉన్నాడు. కొన్ని రోజుల నుంచి వేదాన్ష్ కార్తికేయను అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంచగా గురువారం సాయంత్రం చిన్నారి ఇంటి ఎదుట ఆడుకుంటూ ఒక్కసారిగా ఏడ్చాడు. అమ్మమ్మ వచ్చేసరికి పాము తోక కనిపించగా, పాము కాటేసిందని భావించి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యురాలు ప్రాథమిక చికిత్స చేసి భూపాలపల్లి దవాఖానకు తీసుకెళ్లాలని సూచించారు. అక్కడికి తీసుకెళ్లగా వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేయగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై చెప్పారు.

సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్, నవంబర్ 25: డిసెంబర్ 7, 8 తేదీల్లో జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ హైస్కూల్ (ఓల్డ్ గుడ్ మార్నింగ్ హైస్కూల్)లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ మేళా నిర్వహించనున్నట్లు డీఈవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, కమ్యూనికేషన్, సహజ వ్యవసాయం, విపత్తు నిర్వహణ, మ్యాథమెటికల్ మోడలింగ్, కంప్యూటేషనల్ థింకింగ్, వ్యర్థాల నిర్వహణ, రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై సబ్ థీమ్‌ల ఆధారంగా ప్రాజెక్టులను విద్యార్థులతో తయారు చేయించి ప్రదర్శించాలనారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఎంఈవోలు, హెచ్‌ఎంలు, సైన్స్ టీచర్లు, గైడ్ టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్య

భూపాలపల్లి రూరల్, నవంబర్ 25 : కాసీంపల్లి గ్రామంలో గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మున్సిపల్ పరిధి కాసీంపల్లి గ్రామానికి చెందిన మేకల ప్రవీణ్ (25) నవంబర్ 13న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమి త్తం తొలుత హనుమకొండ దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం ప్రవీణ్ మృతిచెందాడు.

టెక్నికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, నవంబర్ 25: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు డిసెంబర్ 3లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి అప్పని జయదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్ వంటి కోర్సుల్లో దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సర్వేలో పాల్గొనాలి : డీఈవో

న్యాస్‌పరక్– 2024 సర్వేను విజయవంతం చేయాలని డీఈవో పాణిని ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 4న నిర్వహించనున్న సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు బండారుపల్లి మోడల్ పాఠశాలలో శిక్షణ ఇచ్చామని, వారు సర్వేలో పాల్గొని విజయవంతం చేయాలనారు.

సన్నాహక సమావేశానికి తరలిరావాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

కృష్ణకాలనీ, నవంబర్ 25 : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నేడు ఉదయం 9 గంటలకు నిర్వహించే దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈనెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ విజయవంతానికి మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ హాజరుకానున్నట్లు చెప్పారు.

సివిల్ వివాదాలను కోర్టుల్లో పరిష్కరించుకోవాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, నవంబర్ 25: సివిల్ వివాదాలను కోర్టుల్లో పరిష్కరించుకోవాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా దివస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన 18 మంది నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి, చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను అదేశించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దని, సివిల్ వివాదాలను కోర్టుల్లో పరిష్కరించుకోవాలన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్ చెక్‌పోస్ట్ తనిఖీ

వాజేడు, నవంబర్ 25: మండలంలోని చెరుకూరు గ్రామంలో 163–జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఇంటర్ స్టేట్ చెక్‌పోస్ట్‌ను సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సివిల్‌సప్లై కార్పొరేషన్ ఓఎస్డీ ఎం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. చెక్‌పోస్టు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. పక్కరాష్ట్రం నుంచి అనుమతులు లేకుండా ధాన్యం లారీలు వస్తే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.తహసీల్దార్ వీరభద్రప్రసాద్, నాయబ్ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ, గిర్దావర్ కుమారస్వామి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గౌరవ సత్కారానికి దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, నవంబర్ 25: వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న క్రైస్తవులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి టీ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ వేడుకల్లో ఎంపిక చేసిన క్రైస్తవ అభ్యర్థులు, సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వంతో గౌరవ సత్కారం చేయనున్నట్లు చెప్పారు. సామాజిక సేవారంగం, విశిష్టమైన వైద్య సేవలు, విద్యాబోధన, సాహిత్యం, కళలు, క్రీడా రంగాల్లో 10 సంవత్సరాలకు పైబడి సేవలందించిన వారు అర్హులన్నారు. డిసెంబర్ 5 వరకు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

అగ్ని ఆహుతైన ఎండిన భారీ మాను

మహదేవపూర్, నవంబర్ 25 : మండలంలోని బ్రాహ్మణపల్లి పల్లె ప్రకృతి వనం ఎదురుగా ప్రధాన రహదారి పక్కన ఎండిన భారీ మాను సోమవారం అగ్నికి ఆహుతైంది. స్థానికుల కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం ఎండిన భారీ చెట్టు విరిగిపడింది. దీనికి కొందరు వ్యక్తులు నిప్పుపెట్టి ఉంటారని భావిస్తున్నారు. పక్కనే అటవీ క్షేత్రం ఉండడంతో మంటలు వ్యాప్తి చెంది మరిన్ని చెట్లు ఆహుతయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై మండల అటవీశాఖ అధికారి రవిని వివరణ కోరగా ప్రధాన రహదారి పక్కన చెట్టు కాలిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతామన్నారు.

ఘనంగా ఏఎమ్మార్ వార్షికోత్సవ వేడుకలు

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి

మల్హర్, నవంబర్ 25 : మండలంలోని తాడిచెర్ల పంచాయతీ పరిధి కాపురం క్యాంప్ కార్యాలయంలో ఏఎమ్మార్ కంపెనీ వార్షికోత్సవ వేడుకలను సోమవారం అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, ఉద్యోగులకు వారం రోజులు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు, ఉత్తమ కార్మికులకు, ఉద్యోగులకు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్మార్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి, సేఫ్టీ ఆఫీసర్ సురేశ్‌బాబు, మేనేజర్ శ్రీనివాస్, హెచ్ఆర్ డీజీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరికి మహా హారతి

గోదావరికి హారతి పడుతున్న వేద పండితులు

కాళేశ్వరం/వెంకటాపూర్, నవంబర్ 25 : కాళేశ్వరంలోని త్రివేణి సంగమం గోదావరి నదికి సోమవారం వైభవంగా మహా హారతి చేపట్టారు. దేవస్థానం ప్రధాన రాజగోపురం నుంచి నది వద్దకు వెళ్లి ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు నదీ మాతకు మహాహారతి ఇచ్చారు. గ్రామస్తులు, భక్తులు, సేవా సమితి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆకాశ దీపం వెలిగించడం, దేవస్థానం అభిషేక మండపం వద్ద సామూహిక సహస్ర దీపోత్సవం నిర్వహించారు. మట్టి ప్రమిదలు, వత్తులు, నూనె దేవస్థానం నుంచి ఉచితంగా ఇచ్చారు. వేడుకలో పాల్గొన్న మహిళలకు దేవస్థానం తరపున పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు ప్రసాదంగా అందించారు. కాగా, సోమవారం వివిధ రకాల టికెట్లపై, ప్రసాదం అమ్మకంపై దేవస్థానానికి రూ.6,05,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయం భక్తులతో సందడిగా మారింది. రామలింగేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మారేడు, మామిడి చెట్ల కింద దీపాలను వెలిగించారు.

మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సాయం

కన్నాయిగూడెం, నవంబర్ 25 : మండలంలోని బుట్టాయిగూడెంలో ఇటీవల మృతి చెందిన సునార్కాని సమ్మక్క కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కావిరి పద్మ, బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య, పోలయ్య, నర్సింహా రావు, సత్యం 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి అమ్ముకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్, నవంబర్ 25 : రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని అమ్ముకోవాలని, దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం సాయంత్రం భూపాలపల్లి శివారులోని కుందూరుపల్లిలో ఎంఎస్ఆర్ పత్తి మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్‌లో ధరలు పడిపోతున్న సందర్భంలో పత్తికి మద్దతు ధర అందించే ఉద్దేశంతో సీసీఐ కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలి

భూపాలపల్లి రూరల్ : ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జీఎస్ఆర్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ఆయన అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని వాగుల నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే సీజ్ చేయాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణాల కోసం ఇసుక అవసరమైతే పంచాయతీ సెక్రటరీల ద్వారా రసీదు పొంది తరలించాలని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే రవాణాకు అనుమతి ఉంటుందని, నిర్దేశించిన సమయం దాటితే వాహనాలను సీజ్ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇసుక అనుమతులపై రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలని, పోలీసు, రెవెన్యూ, మైనింగ్, సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు చేపట్టి అనుమతులు లేని వాహనాలను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీవో నారాయణరావు, మైనింగ్ ఏడీ. జయరాజ్, భూగర్భజలాలు శాఖ ఏడీ శ్రీనివాసరావు, ఆర్డీవో మంగీలాల్, డీఎస్పీ సంపత్ రావు, తహసీల్దార్లు, సీఐలు పాల్గొన్నారు.

కులగణన సర్వే తప్పులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

భూపాలపల్లి రూరల్, నవంబర్ 25 : సర్వేలో అవకతవకలు జరుగుతున్నాయని చిట్యాల మండలం చల్లగరిగె గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం పేరు తప్పుగా చెప్తూ బీసీలు ఎస్సీలుగా మారే ప్రయత్నం చేస్తున్నారని, ఇది ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. చల్లగరిగె గ్రామ బాలసంతలు బీసీ–ఎకు చెందిన వారని, సర్వేలో బాలసంత అని చెప్పకుండా బేడబుజిగ జంగం (ఎస్సీ) అని చెప్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. సర్వే వివరాలు ఆన్‌లైన్ చేసే ముందు తప్పకుండా విచారణ జరిపి తప్పుడు సమాచారం లేకుండా చూడాలని కోరారు. గతంలో ఈ అంశంపై చిట్యాల తహసీల్దార్, ఎంపీడీవోలను కలిసినట్లు గుర్తు చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే విచారణ చేస్తామని హామీ ఇచ్చారని తెపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు జేరిపోతుల ఓదయ్య, కాంగ్రెస్ గ్రామ ఎస్సీ సెల్ నాయకులు సోమిడి రఘుపతి, దూడపాక సారయ్య, సిరిపెల్లి సారయ్య, నోముల శివశంకర్, దూడపాక దివాకర్, కొల్లూరి అశోక్, నోముల రంజిత్, దూడపాక శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

సివిల్ సప్లయ్ రాష్ట్ర సంయుక్త కమిషనర్ మోహన్‌కుమార్ రాథోడ్


రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ రాష్ట్ర సంయుక్త కమిషనర్ మోహన్‌కుమార్ రాథోడ్

ములుగు, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయ్ రాష్ట్ర సంయుక్త కమిషనర్ మోహన్‌కుమార్ రాథోడ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, దిగుమతుల్లో ఉన్న సమస్యలపై మిల్లర్లకు ఆయన సూచనలు చేశారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుకూలంగా ధాన్యం దిగుమతిలో ఎలాంటి కోతలు విధించొద్దని ఆదేశించారు. తరుగు పేరుతో కోతలు విధిస్తే సంబంధిత మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఎలాంటి బిజినెస్ చేయకుండా సీఎంఆర్ ధాన్యం సేకరణ లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ సహాయ కమిషనర్ వెంకటేశ్వర్ రావు, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, పౌర సరఫరాల అధికారి ఫైజల్ హుస్సేనీ, డీసీవో సర్దార్‌సింగ్, రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, మిల్లర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I Shobha Rani E W/o Thotte Ravi Resident of Balaji Nagar H.No- 25-11-286/2, Kazipet declare that I changed my name from Shobha Rani E to Thotte Rani.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565